సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

పొలాల్లోనే ధాన్యం కొనుగోలు


మద్ది కాటా వద్ద తూకం వేస్తున్న ధాన్యం


పాండ్రంగిలో పొలంలోనే ధాన్యం పడుతున్న పీఏసీఎస్ సిబ్బంది

- ఈ నెల 12 నుంచి ప్రారంభమైన కొనుగోళ్లు
- 21 రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బు జమ
- అన్నదాత కళ్లల్లో ఆనందం

పద్మనాభం: ధాన్యం కొనుగోలు కేంద్రాలు అన్నదాతల్లో ఆనందం నింపుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్మేందుకు రైతులు అవస్థ పడకుండా.. దళారీ వ్యవస్థకు చెక్ పెడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలు సత్ఫలితాలనిస్తున్నాయి. కేంద్రాల ప్రతినిధులు నేరుగా రైతుల పొలాల్లోకి వెళ్లి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. పంటకు గిట్టుబాటు ధర దక్కడంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

క్లస్టర్లుగా ఆర్బీకేలు

పద్మనాభం మండలంలో ఖరీఫ్ సీజన్‌కు ఏడు వేల ఎకరాల్లో రైతులు వరి పంట వేశారు. పంట పక్వానికి రావడంతో రైతులు ధాన్యాన్ని నూర్పి సిద్ధం చేశారు. ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఐదు క్లస్టర్లను ఏర్పాటు చేసింది. రైతు భరోసా కేంద్రాలను క్లస్టర్లుగా ఏర్పాటు చేసింది. పాండ్రంగి క్లస్టర్‌కు బి.ఆర్.తాళ్లవలస, కోరాడ, రేవిడి, వెంకటాపురం, పద్మనాభం గ్రామాలను, బాందేవుపురం క్లస్టర్‌కు మద్ది, విలాస్కాన్‌పాలెం, తునిపాలెం, అనంతవరం క్లస్టర్‌కు గంధవరం, కొవ్వాడ, పెంట, కృష్ణాపురం క్లస్టర్‌కు ఐనాడ అనుసంధానం చేశారు.

ఎక్కడికీ వెళ్లే పని లేకుండా..

గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్ ధాన్యం ఏ తేదీన, ఎంత ధాన్యం కేంద్రాలకు తరలించాలన్నది కూపను జారీ చేస్తారు. ఈ మేరకు కో–ఆపరేటివ్ సొసైటీ సిబ్బంది 17 శాతం లోపల తేమ ఉంటే నేరుగా రైతుల పొలంలోకి వెళ్లి ధాన్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిన కాటా వద్ద తూకం వేయించి, ఆన్‌లైన్‌లో పేర్కొన్న మిల్లుకు తరలిస్తారు. గన్నీలు కూడా క్లస్టర్ వద్దే సరఫరా చేస్తున్నారు. రైతులు మిల్లు వద్దకు వెళ్లాల్సిన పని లేదు. మిల్లుకు కస్టోడియన్లతో ధాన్యాన్ని పంపిస్తున్నారు. సాధారణ రకాలు 1121, సంపత్ స్వర్ణ 9558 రకాలు ధాన్యానికి 2040 గిట్టుబాటు ధర ఇస్తుంది. 21 రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి.

కొనుగోళ్లు ప్రారంభం

ఈ క్లస్టర్లు ఈ నెల 12 నుంచి ధాన్యం కొనుగోలు ప్రారంభించాయి. ఇప్పటికే 184 మంది రైతులు కేంద్రాలకు 2456 టన్నుల ధాన్యాన్ని అమ్మారు. దళారులు క్వింటాకు అదనంగా పది కిలోలు ధాన్యం తీసుకోవడంతో పాటు గిట్టుబాటు ధర ఇవ్వకుండా రైతులను మోసం చేస్తుంటారు. అంతేకాకుండా డబ్బులు ఇస్తారనే గ్యారంటీ ఉండదు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడం, అమ్మిన ధాన్యానికి నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్న నేపథ్యంలో రైతులు ప్రభుత్వ ధాన్య కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని అమ్మడానికి మొగ్గు చూపుతున్నారు.

ఆర్థిక లాభం



ఐదెకరాల్లో వరి పంట వేశాను. పండిన ధాన్యమంతా కొనుగోలు కేంద్రానికి అమ్మాను. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం అమ్మడం వల్ల ఆర్థిక లాభం చేకూరుతుంది. దళారులకు అమ్మితే క్వింటాకు రూ.200 నుంచి రూ.400 వరకు నష్టపోవాలి. ఇప్పుడిక ఆ ఇబ్బందుల్లేవు.

– బుగత సత్యనారాయణ, రైతు, మద్ది

డబ్బులకు గ్యారంటీ



ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం అమ్మితే డబ్బులకు గ్యారంటీ ఉంటుంది. మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా మా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి. మూడెకరాల్లో వరి పంట వేశాను. ఇంట్లో తినడానికి కొన్ని ఉంచుకుని మిగతావి ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రానికి అమ్మాను

– జామి నారాయణ, రైతు, మద్ది

ఘనంగా కోదండ రాముడి తీర్థం


పరస సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్ల వద్ద భక్తుల సందడి


కోదండ రాముడి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మధురవాడ: బక్కన్నపాలెం రోడ్డులో వెలసిన శ్రీగణపతి సాయినాథ సమేత కోదండ రామ ఆలయ పరస మంగళవారం ఘనంగా జరిగింది. ప్రతి ఏటా కనుమ మరుసటి రోజు 400 ఏళ్లుగా ఈ పరస నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అర్చనలు చామర్తి సాతారామాచార్యులు ఆధ్వర్యంలో జరిగాయి. వివిధ ప్రాంతాలు నుంచి తరలివచ్చిన భక్తులు పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అక్కేపాలెం బృందం ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. మధురవాడ, పీఎంపాలెం, కొమ్మాది, మారికవలస పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు విశేషంగా తరలి వచ్చారు. దీంతో మధురవాడ కూడలిలో సందడి నెలకొంది. ఇక్కడ ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్ల వద్ద కొనుగోలుదారులు బారులు తీరారు.

మంత్రి దృష్టికి సమస్యలు


మంత్రి అమర్‌నాథ్‌కు సమస్యలను వివరిస్తున్న గ్రామీణ వైద్యుల సంఘం ప్రతినిధులు

ఆనందపురం/తగరపువలస: పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను మంగళవారం చిట్టివలసలో ఒకటోవార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు. అత్తవారిల్లు అయిన రంగూరి సీతారామదొర ఇంటికి వచ్చిన ఆయనను కలిసి సత్కరించారు. భీమిలి, భోగాపురం, ఆనందపురం కేబుల్ ఆపరేటర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు మంత్రిని కలిసి తమ సమస్యలు వివరించి, పరిష్కరించాలని కోరారు. గ్రామీణ వైద్యుల సంఘం ప్రతినిధులు తమ సమస్యలను రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామీణ వైద్యులకు శిక్షణ, జీవో నంబర్ 429 పునరుద్ధరణ వంటి అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్లు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగం జోషి తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు


కుండపై కూచిపూడి నృత్య ప్రదర్శన


జానపద నృత్యం చేస్తున్న కళాకారులు

పీఎం పాలెం: సంక్రాంతి సంబరాలలో భాగంగా శిల్పారామం(జాతర)లో మంగళవారం సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన కూచిపూడి, జానపద నృత్యాలు అబ్బురపరిచాయి. నగరానికి చెందిన కుశల డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం గణపతి స్తుతి గీతంకు చేసిన కూచిపూడి నృత్యంతో ప్రారంభం అయింది. అన్నమయ్య కీర్తనలకు కళాకారులు అద్భుతంగా కూచిపూడి నృత్యం ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కుండపై ప్రదర్శించిన నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జానపద నృత్య ప్రదర్శన హుషారుగా సాగింది.

కళాకారులు దుర్గాభవాని, యశస్విని, గీతాంజలి, సారిక, రోషని, సీత, కారుణ్య రాఘవ తదితరులు పాల్గొనగా.. అన్నపూర్ణ నృత్య దర్శకత్వం వహించారు. ఏవో విశ్వనాథరెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

క్లుప్తంగా

సోనియాకు ఆర్థిక సాయం


సోనియాకు నగదు అందజేస్తున్న ఉద్యోగులు

పద్మనాభం: శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో చదువుతున్న గంధవరం గ్రామానికి చెందిన కొత్తల సోనియాకు గ్రామ ఉద్యోగులు ఆర్థిక సాయం అందించారు. ఆమె కుటుంబం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవడంతో చేయూతనిచ్చేందుకు అందరూ ముందుకు వచ్చారు. ఉపాధ్యాయులు, ఇతర శాఖల్లో పని చేసిన ఉద్యోగులు కలిపి 10వేల రూపాయలను ఆమెకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు గౌరి, పి.వి.రమణ పాల్గొన్నారు.

దుకాణాల చాటున సూచీ బోర్డులు


బైపాస్ రోడ్డులో గ్రామాల సూచీ బోర్డును మూసేస్తున్న దుకాణం

తగరపువలస: జాతీయ రహదారి వెంట వెలసిన ఆక్రమణలు ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన గ్రామాల సూచీ, సిగ్నల్ బోర్డులను మూసేస్తున్నాయి. దీంతో కొత్తవారికి ఆయా గ్రామాలను వెతుక్కోవడం ఇబ్బందిగా మారింది. స్థానిక బైపాస్ రోడ్డులోని బంగ్లామెట్ట వద్ద తగరపువలస, ఆనందపురం గ్రామాలకు సూచికగా ఏర్పాటు చేసిన బోర్డులు ఇలా చికెన్ దుకాణం ఏర్పాటు, షెడ్డు కారణంగా కనిపించకుండా పోయాయి. అధికారులు స్పందించి సూచీ బోర్డులు కనిపించేలా చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

కొమ్మాది బుల్స్ విజయం


ట్రోఫీని అందుకుంటున్న క్రీడాకారులు

కొమ్మాది: సంక్రాంతి సందర్భంగా జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది గ్రామంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న కేపీఎల్–4 క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. ఈ టోర్నీలో 5, 6, 7వ వార్డుల నుంచి 5 టీమ్‌లు పాల్గొనగా.. కొమ్మాది బుల్స్ విజయం సాధించింది. స్థానిక నాయకులు గుంటుబోయిన సంజీవ్ యాదవ్, పిల్లా సత్యనారాయణ, సియాద్రి కనకరాజు, గురునాథ్ విజేతలకు ట్రోఫీలు అందజేశారు.

క్రికెట్ టోర్నీ విజేత పాలవలస


షీల్డ్‌తో పాలవలస జట్టు

ఆనందపురం : మండలంలోని పాలవలసలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో పాలవలస వీకే వారియర్స్ జట్టు విజేతగా నిలిచింది. ఈ మేరకు మంగళవారం జరిగిన కార్యక్రమంలో భీమిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రౌతు శ్రీను తన సొంత నిధులతో సమకూర్చిన షీల్డ్‌లను అందజేశారు. రన్నర్స్‌గా నిలిచిన చాలెంజ్ జట్టుకు, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, బెస్ట్ బౌలర్‌కు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రౌతు శ్రీను మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి అన్ని రకాల సాయం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఐ పాలవలస రమేష్, రౌతు వెంకటరావు, నిమ్మల అప్పలరాజు, బూర్లె గణపతి తదితరులు పాల్గొన్నారు.

మూడున్నరేళ్ల జగనన్న పాలన అద్భుతం

'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే ముత్తంశెట్టితో ప్రజలు


బ్యాంక్ కాలనీలో మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

తగరపువలస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడున్నరేళ్ల పరిపాలనలో సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అర్హులందరికీ చేరాయని జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డుకు చెందిన బ్యాంకు కాలనీ, మామిడిపాలెం గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంగళవారం సాయంత్రం ఈ గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలుతీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి రాష్ట్రంలో కోట్లాది ప్రజలు ఎన్నడూ లేనంత సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. మరే పార్టీలు ప్రజలను మభ్యపెట్టాలని చూసినా, నమ్మే పరిస్థితి కనిపించడం లేదన్నారు. రాష్ట్రంలో ప్రజల స్పందన చూస్తుంటే ఎన్నికలు ఎప్పుడు జరిగినా మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కొనసాగే అవకాశం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. అన్నివర్గాల ప్రజల కష్టనష్టాలను దృష్టిలో పెట్టుకుని ఏడాది పొడవునా సంక్షేమ పథకాలు అందిస్తున్న దేశంలోని ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం ఆయన బాటను మిగిలిన ముఖ్యమంత్రులు అనుసరిస్తున్నారన్నారు. స్థానికులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. డ్రైనేజీ, వాటర్ ట్యాంక్ నిర్మాణం, ఇంటి పట్టాల మంజూరు, కల్యాణమండపం నిర్మాణం తదితర సమస్యలను వివరించగా, వాటిపై దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్, భీమిలి జెడ్సీ బి.రాము, 4వ వార్డు కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలు, 2వ వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి, ఎస్.కరుణాకరరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, 2వ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బొండా నరసింహమూర్తి, మాజీ కౌన్సిలర్ కదిరి ఎల్లాజీ, గుండాసి మధునాయుడు, ప్రకాష్, భాగం స్వాతి సుధాకర్, బింగి హరికిరణ్‌రెడ్డి, శీరపు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని జీవీఎంసీ రెండోవార్డు నాయకులు జీరు వెంకటరెడ్డి, జీరు వేణుగోపాలరెడ్డి తదితరులు కలిసి సన్మానించారు.

ఈఎస్‌ఐ ఆస్పత్రిలో తుప్పల తొలగింపు


ఆస్పత్రి ఆవరణలో తుప్పలు తొలగించిన దృశ్యం

తగరపువలస: విష పురుగుల సంచారంతో భీతిగొల్పే చిట్టివలస ఈఎస్ఐ ఆస్పత్రి ఆవరణం ప్రస్తుతం తుప్పల తొలగింపుతో పరిశుభ్రంగా దర్శనమిస్తోంది. ఈ ఆవరణలో ఈఎస్ఐ ఆస్పత్రితో పాటు కార్మిక రాజ్య బీమా కార్యాలయం ఉంది. ఈ ఆవరణ మొత్తం చెట్లు, తుప్పలతో నిండిపోవడంతో అడవిని తలపించేది. ప్రహరీని ఆనుకుని చెట్ల మీద నుంచి అవతలి వైపు ఇళ్లలోకి విష పురుగులు ప్రవేశిస్తుండడంతో స్థానికులు ఆందోళన చెందేవారు. దీంతో ప్రస్తుతం ఈఎస్ఐ ఆస్పత్రి యాజమాన్యం చొరవతో చెట్లను వదిలేసి వాటి మధ్య తుప్పలను తొలగించడంతో ఆవరణం క్లీన్‌గా కనిపిస్తుంది. ఆస్పత్రి ప్రహరీ చుట్టూ ఆదర్శనగర్, జోగావారి వీధి, గొల్లవీధి, టీచర్స్ కాలనీల వైపు కూడా తుప్పలను తొలగించి, ఆ ఖాళీ ప్రదేశంలో పండ్లు, పూల మొక్కలను పెంచాలని కోరుతున్నారు.

దుర్గాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


ట్రాఫిక్ సీఐ సాయికి అమ్మ వారి చిత్ర పటం అందజేస్తున్న అర్చకులు, ఆలయ కార్యవర్గ సభ్యులు

మధురవాడ: ఇటీవల పీఎం పాలెం ట్రాఫిక్ పోలీసు ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్.సాయి మంగళవారం చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీసు అధికారులకు అర్చకులు హరిప్రసాద్ శర్మ, రాంబాబు శర్మ, ధర్మకర్త చంద్రశేఖర్, అధ్యక్ష, కార్యదర్శులు పిళ్లా సూరిబాబు, నాగోతి తాతారావు తదితరులు స్వాగతం పలికారు. పూజల అనంతరం అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ట్రాఫిక్ ఎస్ఐ మురళీకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు పిళ్లా అప్పన్న, పోతిన రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

21న అప్పన్న తెప్పోత్సవం


వరాహ పుష్కరిణి వద్ద సిద్ధం చేస్తున్న తెప్ప

సింహాచలం: పుష్య బహుళ అమావాస్యని పురస్కరించుకుని సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామివారి తెప్పోత్సవం(నౌకా విహారం) ఈ నెల 21న జరగనుంది. ఆ రోజు సాయంత్రం కొండ దిగువ వరాహ పుష్కరిణిలో స్వామివారు శ్రీకృష్ణాలంకారంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా నౌకావిహారంతో కనువిందు చేయనున్నాడు. తెప్పోత్సవం సందర్భంగా దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో విశేషంగా ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామివారు విహరించే తెప్పని వరాహ పుష్కరిణి వద్ద ఇంజినీరింగ్ అధికారులు సిద్ధం చేస్తున్నారు. తెప్పోత్సవానికి వరాహ పుష్కరిణి వద్ద జరుగుతున్న ఏర్పాట్లను దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు మంగళవారం పరిశీలించారు.

బావికొండపై ప్రపంచ శాంతి ప్రార్థన


ప్రార్థనలు నిర్వహిస్తున్న సొసైటీ సభ్యులు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురంలోని బావికొండపై ప్రపంచ శాంతి ప్రార్థనలు, బౌద్ధ ధర్మ సభ బుధవారం జిల్లా మహా బౌద్ధ సొసైటీ అధ్యక్షుడు గుణపూడి బాబులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వందన సమర్పణ, భోజన దానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి బోర వేణుగోపాల్ గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



కొమ్మాది: రుషికొండలోని శ్రీమహాలక్ష్మి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు బుధవారం పోటెత్తారు. పండగ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి విశాఖకు వచ్చిన అనేక మంది ఇక్కడ శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

దాడికి పాల్పడిన ఆరుగురిపై కేసు

సబ్బవరం: మండలంలోని గొల్లలపాలెం గ్రామంలో ఒక వ్యక్తిపై సోమవారం రాత్రి కొంత మంది వివాదానికి దిగి దాడికి పాల్పడిన ఘటనలో ఆ వ్యక్తికి గాయాలయ్యాయి. దీంతో సబ్బవరం పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేయడంతో ఆరుగురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. బాధితుడు గొల్లవిల్లి ఈశ్వరరావు తెలిపిన వివరాలు.. గ్రామంలో సీతారాముల తీర్థం నిర్వహించేందుకు గొల్లవిల్లి ఈశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు సమావేశం అయ్యారు. సమావేశంలో తీర్థం నిర్వహణ ఖర్చులపై చర్చ జరిగింది. సమావేశంలో పాల్గొన్న అదే గ్రామానికి చెందిన వద్దాది పైడిరాజు, శ్రీను, దేవుడమ్మ, సాలాపు తమ్మిరాము, కట్ట అప్పలరాజు, కోసిరెడ్డి సన్యాసమ్మలు పండగ చేయడానికి నువ్వెవడవంటూ మూకుమ్మడిగా దాడి చేసినట్టు బాధితుడు తెలిపాడు. పండగను వంగలపైడి సంతోష్ చేస్తారని, పండగ కార్యక్రమాల్లో నేను జోక్యం చేసుకోవడానికి వీల్లేదంటూ దాడికి దిగారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ దాడిలో ఈశ్వరరావుకు పలు చోట్ల గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారని తెలిపాడు. తనపై దాడికి పాల్పడిన ఆ ఆరుగురిపై విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రంగనాథం ఈ సందర్భంగా వెల్లడించారు.

'ఉక్కు' సెగ ఢిల్లీని తాకేలా..


- 30న ప్రజా గర్జన
- ఉక్కు పోరాట కమిటీ నాయకులు వెల్లడి
- 705వ రోజుకు రిలే దీక్షలు


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ, ఢిల్లీకి సెగ తాకేలా ఈ నెల 30న ఉక్కు ప్రజాగర్జన నిర్వహించనున్నామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు తెలిపారు. కార్మికుల ఐక్య ఉద్యమాలతో కేంద్రప్రభుత్వం దిగి రావాల్సిందేనన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 705వ రోజు మంగళవారం సంస్థలోని డబ్ల్యూ.ఆర్.ఎం–1 మరియు 2 విభాగాల కార్మికులు పాల్గొన్నారు. కార్మికులను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎస్.రామారావు, జె.రామకృష్ణ, వరసాల శ్రీనివాసరావు, పరంధామయ్య, చిత్రాడ సన్యాసిరావు, కె.శ్రీనివాసనాయుడు, గుమ్మడి నరేంద్ర, బి.డేవిడ్ తదితరులు ప్రసంగించారు. కార్మికులు చేస్తున్న ఉద్యమాన్ని కేంద్రప్రభుత్వం అణచివేయలేదన్నారు. రాష్ట్ర అభివృద్ధికి విశాఖ ఉక్కు చాలా ముఖ్యమని, దీనిని ప్రైవేటీకరణ చేస్తే ప్రజలందరూ నష్టపోతారని తెలిపారు. లక్షల మందికి అన్నం పెడుతున్న పరిశ్రమను అమ్మేయాలనుకోవడం అత్యంత దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని కేంద్రప్రభుత్వం ప్రకటించే వరకు దీక్షలు కొనసాగిస్తామన్నారు. ఇప్పటికైనా, కేంద్రప్రభుత్వం కార్మికుల మనోభావాలకు విలువనిచ్చి ప్లాంట్ విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మురళి, బాషా, రాజు ఇతర కార్మికులు పాల్గొన్నారు.

29 పనులు.. రూ.2.52 కోట్లు

'గడప గడపకు..' సమస్యల పరిష్కారానికి నిధుల మంజూరు


అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ 1,2,3,4 వార్డులకు సంబంధించి గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి ఇప్పటి వరకు 29 పనులకు నిధులు మంజూరైనట్లు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. భీమిలిలోని తన క్యాంప్ కార్యాలయంలో అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పనులు పూర్తి చేయడానికి ప్రభుత్వం రూ.2.52 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ పనులు నెలరోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో అధికారులు, వార్డులకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
భీమిలి
9666125299, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
భీమిలి
9912220753
Office mail : sakshiadvtvsp@gmail.com